

# పాలానందం

ఎ.వి. శేషారత్నం

ప్లాట్‌ఫారమంతా సందడిగా ఉంది వచ్చే పోయే జనంతో - అమ్ముకునే వాళ్ళ కేకలతో.

పరుగులాంటి నడకతో వచ్చి అరటి పళ్లు. బాలాగైడు మేగజైన్స్ చెల్లెలి చేతిలో పెట్టాడు ప్రసాదరావు.

"శ్రీలేఖా! హైదరాబాద్ చేరగానే టెలిగ్రాం ఇస్తావుకదూ!" దిగులుగా తలూపింది శ్రీలేఖ.

"నువ్వలా దిగులుపడితే నాకు కుదురుండదు. సృజన ఉందిగా ఏం భయంలేదు. అయినా బావగారు మరీ అంత అర్జంటుగా పంపమని వ్రాయకపోతే ఏ చిన్న వృల్లో పంపడం అమ్మకి. నాకూ కూడా ఇష్టంలేదు. అమ్మకి ఒంట్లో ఏ మాత్రం బాగున్నా నీకు మీ వదినని తోడిచ్చి పంపేవాడిని"- నొచ్చుకున్నాడు ప్రసాదరావు.

"ఏంటన్నయ్యా నువ్వు మరీను. నేను మనిషిని కాదేంటి! అక్కయ్యని. బాబుని నేను జాగ్రత్తగానే చూసుకుంటానే. బాబు ఇప్పుడు మరీ ముద్దొచ్చేస్తున్నాడు కదన్నయ్యా! మూడు నెల్లంటే ఎవరూ నమ్మరు"-బ్రేకుల్లేని కారులా, ఆనకట్ట లేని ప్రవాహంలా సాగిపోతోంది సృజన వాగ్ధోరణి.

ప్రసాదరావు దృష్టంతా శ్రీలేఖ మీదే వుంది. నిండా ఇరవై మూడేళ్ళు లేని శ్రీలేఖ ఇద్దరు పిల్లలకి పురిట్లోనే సంధికొట్టించాడు ఆ భగవంతుడు. ఈ సారి కనీసం ఆరు నెలలయినా అయితే గాని పంపడం ఇష్టం లేదతనికి. కాని కోపిష్టి బావగారికి భయపడి రిజర్వేషన్ దొరక్కపోయినా పంపుతున్నాడు చెల్లెల్ని.

"సృజనా" ఎంతో అవసరం అయితే తప్ప బాబుకి సీసాపాలు పట్టకు. వాడికి అంతగా పడవు. పాలు సీసానిండా పోసి పెట్టింది వదిన. అదిగో ట్రెయిన్ కదులోంది చేతులు లోపలికి తీసుకో సృజనా! శ్రీలేఖా! ఉత్తరం వ్రాయి చేరగానే. బాబు జాగ్రత్త!" రైలు ప్లాట్‌ఫారం దాటి పోతున్నా చెబుతూనేవున్నాడు ప్రసాదరావు.

అన్నగారు కనుచూపుమేర దాటగానే కంపార్టుమెంటు కలియ జూసింది శ్రీలేఖ. సృజన బాబుతో ఆడుకుని మెల్లిగా నిద్ర పుచ్చింది. ఎదుటి సీటులో గిరిజన యువతి తప్ప అంతా మగవాళ్ళే.

భయంభయంగా పెద్దకళ్ళతో చూస్తోంది ఒంటిన రవికయినా లేకుండా ఎదుటి సీటు అంచున ఆ యువతి. పల్లెటి వలువ. కాళ్ళకి దుక్కలాంటి వట్టాలు. మెళ్ళో పూసలు. కాసంత ఎర్రని బొట్టు. చింకిచీర. చింపిరి జుట్టు ముడేసింది. ఒన్నెత్తైజా దున్నపోతులా వుంది.

"డర్టీఫెలో" -సృజన గొణిగింది- శ్రీలేఖ మనసులో అనుకున్న మాటనే.

"అబ్బ! ఇలాంటి వాళ్ళని అసలు రైలెక్కనీకూడదు. ఆమడ వరకూ కంపు. ఆ చీర ఏ జన్మనా ఉతికివుండదు. స్నానం చేసి ఎన్నిజన్మలయిందో. కళ్ళలో ఆ పుసులు- ఛీ! మూడేళ్ళొచ్చినా ఆ కుర్ర వెధవ చూడు వళ్ళిగ్గా ఎలా...." -ఆ యువతి చన్ను గుడుస్తున్న కుర్రాడిని చూపిస్తూ అక్క చెవిలో గుసగుసలాడింది సృజన.

శ్రీలేఖకి కూడా ఆ మనిషిని చూస్తుంటే కంపరంగానే వుంది. ఇంతలో వెనక కూపేలో గొడవ మొదలయింది. కుర్రాళ్ళెక్కినట్టున్నారు. పాటలు. ఈలలు. కేకలు.

పేకాట అయిపోయినట్టుంది. నెమ్మదిగా వీళ్ళ సీట్ల దగ్గరకి చేరి బైటాయించి దొంగ చూపులు. ద్వంద్వార్థపు పాటలు మొదలెట్టారు.

ఇంతదాకా ఆ స్త్రీని చూస్తున్న సృజన. శ్రీలేఖ గాభరాపడ్డారు. వాళ్ళ గోలకి నిద్ర పోతున్న బాబు లేచి ఏడుపు లంకించుకున్నాడు.

"అనుకున్నంతా అయింది. వాడు ఏడిస్తే ఊరుకోబెట్టడం తమవల్ల కాదు పాలిస్తేగానీ ఊరుకోడు."

సృజన నానా తిప్పలూ పడుతోంది.

స్టూడెంట్సంతా విలాసంగా కుతూహలంగా చూస్తున్నారు.

'వాళ్ళు కాస్త వెనక బెర్తులవైపు వెళ్ళిపోతే బాగుండును. బాబు గుక్కపెడుతున్నాడు కానీ ఇంతమంది కళ్ళు తనని చూస్తుంటే పాలివ్వడం-ఛీఛీ' అంత గాబరాలోనూ మెరుపు మెరిసింది శ్రీలేఖకి

"సృజనా! పాలసీసా తియ్యి."

తేలిగ్గా ఊపిరి పీల్చిన సృజన అలాగే నిలబడిపోయింది. పాలు- ఉడుకుకి విరిగి పోయి ఉన్నాయి. ఇప్పట్లో స్టేషన్ కూడా రాదు. పోనీ అక్కడి పాలిమ్మని చెప్దామని నోటి చివరిదాకా వచ్చినా అక్కడి వాతావరణాన్ని చూసి జంకింది సృజన.

బాబు గోల ఎక్కువయిపోయింది. కక్కటిల్లిపోతున్నాడు. కలత నిద్దరయింది- అందులో ఆకలి కూడా రేగినట్టుంది. వాడిని ఆపడం ఎవరితరమూ కావడంలేదు. మనసు లేని మనిషిలా పరిగెడుతూంది రైలు.

శ్రీలేఖ తల్లి మనసు కొట్టుకుపోతోంది

కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"అక్కా"— బేలగా, నిస్సహాయంగా చూసింది సృజన. ఆ పిల్లకి ఏం తోచడం లేదు.

'ఆ కుర్రాళ్ళలా నిరాక్షిణ్యంగా వత్తి కాయల్లా కళ్ళు తెరుచుకుని చూస్తుంటే అక్క ఎలా–'

శ్రీలేఖకి దుఃఖం ముంచుకొచ్చింది. బాబుని సృజన కందించి వాడి ఏడుపుని వినలేనట్టు లేచి టాయ్‌లెట్ వైపు నడిచింది.

నాలుగడుగులు వేసిందో లేదో- తుపాను వెలిసినట్టు. ఒక్కసారిగా బాబు ఏడుపాగి పోయింది. దడదడలాడే గుండెతో ఏమయిందోనని వెనుదిరిగిన శ్రీలేఖ నిశ్చేష్టురాలయి నిలబడిపోయింది.

కుర్రాళ్ళ కేకలు సడెన్‌గా ఆగిపోయాయి. ఆ దృశ్యానికి సిగ్గుపడుతున్నదానిలా తల వంచుకున్నా ఆనందిస్తోంది సృజన. "మాతృత్వం" పేరుతో చెయి తిరిగిన చిత్రకారుడు గీసిన బొమ్మలా- -దర్టీ ఫెలో- గిరిజన యువతి- పల్లదువన్న పోతు- నిర్వికారంగా పల్లిగ్గా- సిగ్గులేకుండా రవిక లేని శరీరంతోనే బాబుని గుండెకు హత్తుకుని పాలిస్తోంది.

అమడ దూరం కంపు కొడుతున్న ఆ చింకి చీరనే బుల్లి చేతులతో తడుము తున్నాడు బాబు కాళ్ళాడిస్తూ. ●

---

## మధుర తరంగాలు

**వనిమిరెడ్డి సువర్ణ**

ఆగకుండా అదే పనిగా మ్రోగుతోంది టెలిఫోన్. "హబ్బబ్బా ...ఎవరక్కడ వెంకమ్మా...రంగన్నా.." పెద్దగా కేకేసినా ఎవరూ రాకపోవడంతో వ్రాస్తున్న పెన్ అక్కడే పెట్టేసి విసుక్కుంటూ వచ్చి రిసీవర్ అందుకున్నారు సుప్రసిద్ధ నవలా రచయిత్రి నిర్మలాదేవి.

"హలో.... నిర్మలాదేవి హియర్."

".... .... ...."

"ఓ మీరా! ఆఁ"

"అబ్బే లాభం లేదండీ. అయినా ఎంత బిజీవేళ కదా ఎక్కువ. మీరు చెప్పినదాని కన్నా నేనడిగింది."

"...."

"ఆరు గంటలకి ఒక ఫంక్షన్‌కి అటెండ్ అవ్వాలి. అప్పటి వరకు ఇంట్లోనే వుంటాను."

".... .... ...."

"అలాగే. థాంక్స్."

రిసీవర్ క్రెడిల్ మీద వుంచి వెనుతిరిగింది ఆనందంతో.

ఇంతలో మళ్ళీ పిలిచింది. టెలిఫోన్.

తనే అందుకుంది. రంగన్న ఎక్కడికెళ్ళాడా అనుకుంటూ.

".... ...."

"ఆఁ.... నేనే మాట్లాడుతున్నాను."

"...."

"థాంక్సండీ."

".... ...."

"థాంక్యూ వెరీ మచ్."

ఇంతలో లైన్ కట్టయింది.

'థాంక్ గాడ్' అనుకుంటూ రిసీవర్ పెట్టేసింది.

అభిమానుల పరంపర.

మొదట్లో అంతులేని ఆనందం. కానీ.... రాను రాను విసుగు పుడుతుంది కానీ తను రిసీవ్ చేసుకునేది ఎప్పుడో ఒకసారి. అందుకే విసుకు కనపర్చకుండా వాళ్ళు అడిగిన వాటికి జవాబులిస్తుంది పాపం తనూ ఒకప్పుడు వాళ్ళలాంటిదే కదా అన్న సానుభూతితో.

తనూ.... మొదట్లో చిన్న చిన్న కథలు వ్రాసేది. వాటిని అలాగే వదిలేయకుండా పట్టుదలతో సీరియల్స్. నవలలు ఒకటేమిటి ఎన్నో వ్రాసి ఇప్పుడు ప్రసిద్ధి పొందిన రచయిత్రులలో తనూ ఒక మెంబర్ అయింది.

ఐదారు నవలలు సినిమాలుగా కూడా వచ్చాయి. అన్నీ 'సూపర్ హిట్'. అందుకే ఈ సారి తను వ్రాసిన "మధుర తరంగాలు" నవల సినిమా తీస్తామని నిర్మాత రాగానే



రేటు పెంచేసింది. వాళ్ళే ఇందాక ఫోన్ చేసింది. తను చెప్పినంతకే ఒప్పుకున్నారు. "ఆ.. అయినా వాళ్ళకెంత లాభమో కదా!" అని ఆలోచిస్తూ కూర్చుంది.

ఇంతలో "టీ" కప్పుతో రంగన్న వచ్చాడు. కప్పు అందుకొని "నాకోసం ఎవరైనా వస్తే కూర్చోమని చెప్పు" అంటుండగానే కనకలక్ష్మి వచ్చింది. ఈ రోజు ఒక ఫంక్షనుంది వెళ్ళాలంటూ.

కనకలక్ష్మి నిర్మలాదేవిగారి పర్సనల్ సెక్రెటరీ.

"ఆఁ.... నాకు గుర్తుందిలే" అంటూ రెండు గుక్కల్లో టీ త్రాగడం పూర్తిచేసి లోపలికెళ్ళారు నిర్మలాదేవి రెడీ అవటానికి. అయిదున్నర అవుతూవుండగా వచ్చారు వాళ్ళు! అప్పుడే "మేకప్" పూర్తయి కారు కీస్ తీసుకుని హాల్లోకి వచ్చింది నిర్మలాదేవి.

కాసేపు నవలలోని సన్నివేశాల గురించి మాట్లాడుకున్నాక ఆమె అడిగినంతా చెక్కు రూపంలో ఇచ్చి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే ఆనందం పట్టలేక ఎగిరి గంతేసింది సుప్రసిద్ధ నవలా రచయిత్రి నిర్మలాదేవి.

అంతే.

...దబ్‌మని క్రింద పడటంతో మెలుకువ వచ్చింది నిర్మలకి.

"ఆఁ ... ఇదంతా కలా" నిస్తుపోతూ లేచి గబుక్కున మంచమెక్కేసింది నిర్మల.

టైమ్ చూసింది మూడవుతూంది.

"మధ్యాహ్నం పన్నెండింటప్పుడు ఈ రోజు ఎలాగైనా కథ వ్రాయాలని ఆలోచిస్తూ పడుకుంది. ఆలోచిస్తుండగానే నిద్ర పట్టేసింది కాబోలు!'

తన కలకి తనే నవ్వుకుంది.

పాపం నిర్మల! ●